అదానీపై పీఛే ముడ్

మొదటిపేజీ తరువాయి...

చెప్పారు. అయితే వాస్తవం మరొకటన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

పార్లమెంట్‌లో నిలదీస్తారనే భయం

రాహుల్‌గాంధీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్న అదానీతో కాంగ్రెస్ సీఎం రేవంత్‌రెడ్డి స్నేహం చేయడం జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. గురువారం ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో ఇదే విషయంపై ఒక జర్నలిస్టు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పలేక రాహుల్‌గాంధీ ఇబ్బందిపడ్డారు. దీంతో అదేరోజు రేవంత్‌రెడ్డిపై రాహుల్‌గాంధీ సీరియస్ అయినట్టు పార్టీలో ప్రచారం జరుగుతున్నది. అదానీ పెట్టుబడులను ఆహ్వానించడమేకాకుండా రూ.100 కోట్ల విరాళం తీసుకోవడంపై రాహుల్‌గాంధీ సీఎంను వివరణ కోరినట్టు సమాచారం. పార్టీ పాలసీకి వ్యతిరేకంగా వ్యవహరించి కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతున్నారంటూ ఢిల్లీ పెద్దలు సైతం సీఎంపై అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో ఇదే అంశాన్ని సభలో ప్రస్తావిస్తే ఇరుకున పడతామని కాంగ్రెస్ పెద్దలు భయపడ్డారని చెప్తున్నారు. అందుకే, ఈ అంశంపై వెంటనే నిర్ణయం తీసుకొని ప్రజలకు వివరణ ఇవ్వాలని అల్టిమేటం జారీచేసినట్టు తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ఢిల్లీ పర్యటనకు బయలుదేరే ముందే వివరణ ఇవ్వాలని స్పష్టంచేసినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. అందుకే హడావుడిగా ప్రెస్‌మీట్ పెట్టి వివరాలు వెల్లడించారని అంటున్నారు. అయితే, రాష్ట్రంలో అదానీ పెట్టుబడుల విషయం లోనూ వెనక్కి తగ్గుతారా? భవిష్యత్తులో పెట్టుబడులు పెట్టకుండా బ్లాక్‌లిస్ట్‌లో పెడతారా? అన్న ప్రశ్నలకు మాత్రం సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం దాటవేశారు. చట్టబద్ధంగా పెట్టుబడులు పెట్టేందుకు అందరికీ అవకాశాలు ఇవ్వాలన్నది నిబంధన అని, ఇదే విషయాన్ని రాహుల్‌గాంధీ కూడా చెప్పారంటూ తప్పించుకున్నారు.

రాజకీయాలతో సంబంధం లేదు.. కానీ మంత్రులను కలుస్తా

తాను సోమవారం ఢిల్లీకి వెళ్లి మంగళవారం తిరిగి వస్తానని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఈసారి పర్యటనకు రాజకీయాలతో సంబంధం లేదని, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కుమార్తె పెండ్లికి హాజరయ్యేందుకు వెళ్తున్నానని చెప్పారు. మంగళవారం ఉదయం కాంగ్రెస్ ఎంపీలతో సమావేశం అవుతానని, పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చిస్తానని తెలిపారు. ఆ తర్వాత అందుబాటులో ఉన్న కేంద్ర మంత్రులతో భేటీ అవుతాననడం విశేషం. ఇక.. రేవంత్‌రెడ్డి ఢిల్లీ పెద్దలను కలిసి అదానీ అంశంపై వివరణ ఇచ్చేందుకు ప్రయత్నించినట్టు సమాచారం. అయితే అపాయింట్‌మెంట్ దొరకలేదని ప్రచారం జరుగుతున్నది. దీంతో ఎంపీలతో సమావేశానికే పరిమితమయ్యారని, షెడ్యూల్‌లో మిగిలిన సమాయాన్ని మంత్రులను కలవడానికి కేటాయిస్తున్నారని చెప్తున్నారు.

అర్రాస్ పాటలా లెక్కిస్తున్నారు

సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఆయన గత 11 నెలల్లో ఢిల్లీకి వెళ్లడం ఇది 28వ సారి. కొందరు తాను ఢిల్లీకి వెళ్లిన ప్రతిసారీ అర్రాస్ పాటలా లెక్కిస్తున్నారంటూ సీఎం మండిపడ్డారు. ఎవరి కాళ్లో పట్టుకోవడానికి తాను ఢిల్లీ వెళ్లడం లేదని, కేంద్ర మంత్రులను కలిసి తెలంగాణకు రావాల్సినవాటి గురించే వెళ్తున్నామని చెప్పారు. అయితే.. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు 27 సార్లు ఢిల్లీకి వెళ్లి, కేంద్ర పెద్దలను కలిసి ఏ ప్రాజెక్టులు సాధించారో, ఎంత మేర అదనపు నిధులు వచ్చాయో చెప్పాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తున్నది.

ఆరోపణలు చేయబోయి అభాసుపాలు

అదానీతో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ స్నేహం చేశారని, కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే అదానీ తెలంగాణలో పెట్టుబడులు పెట్టారంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు తెలంగాణలో అదానీ పెట్టుబడుల జాబితా విడుదల చేశారు. కేసీఆర్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయబోయి సీఎం అబాసుపాలయ్యారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీఎం చెప్పిన అంశాల్లో మూడు నేషనల్ హైవేలు ఉన్నాయి. అయితే నేషనల్ హైవేల టెండర్లు, నిర్వహణ, పర్యవేక్షణ మొత్తం నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా చూసుకుంటుంది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం ఉండదన్న విషయం సీఎంకు తెలియకపోతే ఎలా? అని నిపుణులు విమర్శిస్తున్నారు. 2014లో అదానీ పవర్ ప్రాజెక్టులు పెట్టుకునేందుకు కేసీఆర్ అనుమతించినట్టుగా ఒక వార్త క్లిప్పింగ్‌ను సీఎం ప్రదర్శించారు. అయితే, అదానీ పెట్టుబడులను తిరస్కరిస్తున్నట్టు 2017 అక్టోబర్‌లో నాటి సీఎం కేసీఆర్ ప్రకటించారని బీఆర్ఎస్ నేతలు చెప్తున్నారు. ఈ విషయాన్ని రేవంత్‌రెడ్డి ఎందుకు కప్పిపుచ్చారని ప్రశ్నిస్తున్నారు. అదానీకి చెందిన 750 కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్ ప్రాజెక్టుపై బీఆర్ఎస్‌ను విమర్శించారు. ఇది తెలంగాణ ప్రాజెక్టు కాదని, గుజరాత్ నుంచి తెలంగాణ మీదుగా ఏపీకి వెళ్లే లైన్ అని, దీని టెండర్లకు తెలంగాణతో సంబంధం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఎల్లికట్టలో డాటా సెంటర్‌కు మైక్రోసాఫ్ట్‌ను చూసి అనుమతి ఇచ్చారని, ఆ సంస్థ థర్డ్ పార్టీ సంస్థతో నిర్మాణాలు చేయిస్తే ప్రభుత్వానికి ఏం సంబంధం? అని ప్రశ్నిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన జాబితాలోని అదానీ-ఎల్బిట్ సిస్టమ్స్ డిఫెన్స్ యూనిట్, మిస్సైల్ షెల్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ రక్షణ రంగానికి చెందినవని గుర్తు చేస్తున్నారు.

కొడంగల్‌లో అదానీ సిమెంట్ ప్లాంటు

బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బదనాం చేయబోయి సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా తన రహస్యాలను బయటపెట్టుకున్నారు. తెలంగాణలో అదానీ ఎక్కడెక్కడ పెట్టుబడులు పెట్టారో, ఎక్కడ పెట్టబోతున్నారో, దీనికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా సహకరించిందో స్వయంగా వివరించారు. ఇందులో రెండు సిమెంట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. నల్లగొండ జిల్లా రామన్నపేటలో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ఇప్పటికే ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతున్నది. ఆరు మిలియన్ టన్నుల సామర్థ్యంతో ప్లాంట్ ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వమే అనుమతి ఇచ్చినట్టు సీఎం చెప్పారు. రెండో ప్లాంట్‌ను తన సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ఏర్పాటు చేస్తున్నట్టు సీఎం వెల్లడించారు. ఇప్పటికే ఫార్మా క్లస్టర్ పేరుతో పొలాలను గుంజుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తే.. రైతులు అడ్డుకోవడం, అధికారులపై దాడి, అనంతరం పోలీసుల దాష్టీకం వంటివి సంచలనం సృష్టించాయి. లగచర్ల ఘటన జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. ఇలాంటి చోట తొమ్మిది మిలియన్ టన్నుల సిమెంట్ ప్లాంటు ఏర్పాటు చేసేందుకు అదానీ సంస్థ ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందించింది. కొడంగల్ ప్రజలు గెలిపించి ముఖ్యమంత్రిని చేసినందుకు సీఎం తన నియోజకవర్గ ప్రజలకు ఫార్మా కాలుష్యానికి తోడు సిమెంట్ ఫ్యాక్టరీ కాలుష్యాన్ని బహుమతిగా ఇవ్వదలుచుకున్నారా? అనే విమర్శలు వినిపిస్తున్నాయి. వీటితోపాటు ఐదు వేల మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు, రామన్నపేటలో లాజిస్టిక్స్ పార్క్, డ్రైపోర్టు, చందనవెల్లిలో డాటా సెంటర్ ఏర్పాటు కాంగ్రెస్ హయాంలో నివేనని సీఎం చెప్పుకొచ్చారు.

నాడు స్కిల్ యూనివర్సిటీకి రూ. వంద కోట్ల విరాళం ప్రకటించి, అందుకు సంబంధించిన పత్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేస్తున్న అదానీ

ఫ్రస్టేషన్‌లో సీఎం

సీఎం ఇప్పటివరకు 27సార్లు ఢిల్లీకి వెళ్లినప్పటికీ పర్యటనకు ముందు ప్రెస్‌మీట్ నిర్వహించలేదు. కానీ, సోమవారం ప్రత్యేకంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్రస్టేషన్‌లో ఉన్నట్టు కనిపించింది. పలుమార్లు మాటలు తడబడటం, మోతాదుకు మించి తిట్లను వాడటం వంటివి ఇందుకు ఉదాహరణలని మీడియా వర్గాల్లో చర్చించుకుంటున్నారు. తాను ఎప్పుడు ఢిల్లీకి వెళ్లినా మంత్రివర్గ విస్తరణ అంటూ రాసేస్తున్నారని, శాఖల కేటాయింపులు కూడా మీరే చేస్తున్నారంటూ మీడియా ప్రతినిధులపై సీఎం రుసరుసలాడారు. అదానీ అంశంపై వివరణ ఇచ్చేందుకు ప్రెస్‌మీట్ ప్రారంభించి సొంత ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టుకునేలా వివరాలు చెప్పడం ద్వారా సీఎం పరిస్థితి అర్థమవుతున్నదని అంటున్నారు.

విరాళం తిరస్కరణ వెనుక అనేక సందేహాలు

- రేవంత్‌వి ద్వంద్వ ప్రమాణాలు
- బీఆర్ఎస్ నేత దాసోజు ధ్వజం

దాసోజు శ్రవణ్

హైదరాబాద్, నవంబర్ 25(నమస్తే తెలంగాణ): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.100 కోట్ల అదానీ విరాళాన్ని తిరస్కరించడం వెనుక అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయని బీఆర్ఎస్ నేత దాసోజు శ్రవణ్ చెప్పారు. రూ.1200 కోట్లకుపైగా ఒప్పందాలను అనుమతించిన రేవంత్‌రెడ్డి, విరాళాన్ని వెనక్కి ఇచ్చేయడంలోని అంతర్యమేంటని సోమవారం ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. క్రోనీ క్యాపిటలిజానికి వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ గళమెత్తుతుంటే.. రేవంత్ మాత్రం వారికి వంతపాడుతున్నారని ఆరోపించారు. 'ఆయన రాహుల్ నాయకత్వంలో పనిచేస్తున్నారా? లేదంటే అదానీ ప్రయోజనాలను కాపాడుతున్నారా?' అని శ్రవణ్ నిలదీశారు. రేవంత్ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తూ రాహుల్, కాంగ్రెస్ నిబద్ధతను ప్రశ్నార్థకం చేస్తున్నారని మండిపడ్డారు. చిన్న దేశమైనా కెన్యా అదానీ కంపెనీలతో ఒప్పందాలను రద్దుచేసుకున్నప్పుడు, రేవంత్ ఎందుకు చేయలేరని ప్రశ్నించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే అదానీ ఇచ్చిన విరాళాన్ని తిరస్కరించారని మండిపడ్డారు.

దీక్షా దివస్‌కు బీఆర్ఎస్ కార్యాచరణ

నేడు అన్ని జిల్లాల్లో బీఆర్ఎస్ సన్నాహక సమావేశాలు

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): దీక్షా దివస్ ఆర్తి, స్ఫూర్తిని రగిలించేందుకు బీఆర్ఎస్ సన్నద్ధమవుతున్నది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన, తద్వారా రాష్ట్ర సాధనకు దారితీసిన రోజుగా తెలంగాణ చరిత్రలో 29 నవంబర్ 2009కి ప్రత్యేక స్థానం ఉన్నది. 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో.., తెలంగాణ జైత్రయాత్రో.. కేసీఆర్ శవయాత్రో' అంటూ తెలంగాణ కోసం బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు నవంబర్ 29న ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. కరీంనగర్ నుంచి సిద్దిపేట ఆమరణ దీక్షాస్థలికి బయలుదేరిన కేసీఆర్‌ను అల్గనూరు క్రాస్ రోడ్డు వద్ద ఆయనను పోలీసులు అరెస్టు చేసి అత్యంత నాటకీయ, ఉత్కంఠ పరిణామాల మధ్య ఖమ్మం జైలుకు తరలించడంతో ఖమ్మం సబ్‌జైలు నుంచే కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. నవంబర్ 29 నుంచి డిసెంబర్ 9 వరకు 11 రోజులపాటు తెలంగాణ సమాజం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తప్ప తమకు మరో ప్రయత్యామ్నాయం అక్కరలేదని తెగేసి చెప్పిన నేపథ్యంలో నాటి కేంద్ర హోంశాఖ మంత్రి చిదంబరం 'తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తాం' అని ప్రకటించారు. కేసీఆర్ ఆమరణ దీక్ష తెలంగాణ సమాజాన్ని ఏకోన్ముఖం చేయడం వల్లే రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ 2010 నవంబర్ 29వ నుంచి నవంబర్ 29వ తేదీని దీక్షా దివస్‌గా పాటిస్తున్నది. ఈ ఏడాది కూడా దీక్షా దివస్‌ను ఘనంగా నిర్వహించేందుకు గులాబీ శ్రేణులు సిద్ధం అవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పార్టీ సన్నాహక సమావేశాలు నిర్వహించి కార్యాచరణపై సమీక్షించేందుకు పార్టీకి చెందిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ జడ్పీ చైర్మన్లు సహా పార్టీ సీనియర్ నేతలను జిల్లాకో ఇన్‌చార్జీని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియమించారు. ఈ నేపథ్యంలో మంగళవారం దీక్షా దివస్ జిల్లా ఇన్‌చార్జీలు అన్ని జిల్లాల్లో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశాన్ని నిర్వహించనున్నారు. 2009లో నవంబర్ 29 నుంచి డిసెంబర్ 9 వరకు 11 రోజులపాటు జిల్లాలో చోటు చేసుకున్న పరిణామాలు ఏమిటీ? పోరాట రూపాలు, పోరాటయోధులు సహా ఇతరేతర ముఖ్య ఘట్టాలను నెమరువేసుకుంటూ 14 ఏండ్ల క్రితం తెలంగాణ స్థితిగతులు, పోరాట నేపథ్యాన్ని ఈతరానికి పరిచయం చేయడానికి దీక్షా దివస్‌ను ఎలా వేదికగా మలుచుకోవాలనే అంశాలపై సమాలోచనలు చేయనున్నారు.

ఒప్పందాలన్నీ రద్దు చేయాలి

మొదటిపేజీ తరువాయి...

పాటించింది. అవినీతిపరుడంటూ రాహుల్‌గాంధీ విమర్శించిన వ్యక్తికే గల్లీ కాంగ్రెస్ రెడ్‌కార్పెట్ పరిచిందని ధ్వజమెత్తారు. ఢిల్లీలో రాహుల్‌గాంధీ వ్యతిరేకిస్తున్న అదానీతోనే రేవంత్‌రెడ్డి దోస్తీ చేసి ఒప్పందాలు చేసుకున్నారని, అదానీ అవినీతి బయటికిరాగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట మార్చారని దుయ్యబట్టారు.

కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించిన వ్యక్తిని బయటకు పంపిస్తున్న సీఐ

మంత్రి సభలో ఆఫీసర్లకు అవమానం

కమలాపూర్, నవంబర్ 25: హనుమకొండ జిల్లా కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ సభలో అధికారులకు అవమానం జరిగింది. సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరు కావడంతో అధికారులు కూడా వచ్చారు. సభలో మంత్రితో పాటు అధికారులను స్టేజీపైకి ఆహ్వానించారు. స్టేజీపైకి అధికారులు వెళ్లకముందే కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్‌తోపాటు మరికొందరు నాయకులు సీట్లను ఆక్రమించారు. దీంతో ఎంపీడీవో బాబు, ఏవో లక్ష్మారెడ్డి, మార్కెటింగ్ శాఖ అధికారులు రాజా, యాకయ్య స్టేజీ పక్కనే నిస్సహాయంగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందని దేశరాజ్‌పల్లికి చెందిన ఓ వ్యక్తి నిలదీయడంతో వెంటనే సీఐ హరికృష్ణ అతడిని బయటకు పంపించారు. మర్రిపెల్లిగూడెంకు చెందిన కాంగ్రెస్ నాయకుడు సలుపాల తిరుపతి జేబు నుంచి రూ. 30వేలు దొంగలు కొట్టేయడంతో కన్నీటి పర్యంతమయ్యాడు.

మహారాష్ట్రలో కాంగ్రెస్ ఓడిపోతే బీజేపీ, బీఆర్ఎస్ సంబురాలు

మహారాష్ట్రలో కాంగ్రెస్ ఓడిపోతే బీజేపీ, బీఆర్ఎస్ సంబురాలు చేసుకున్నాయని, ఆ రెండు పార్టీలు ఒక్కటేనని తేలిపోయిందని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ఎల్లంపల్లి నుంచి సాగునీళ్లు ఇచ్చామని చెప్పారు.

కేడీసీసీబీకి మరో అరుదైన గౌరవం

- 2023-24 ఆర్థిక సంవత్సరానికి జాతీయ ఉత్తమ బ్యాంకుగా ఎంపిక
- రేపు ఢిల్లీలో అమిత్‌షా చేతుల మీదుగా అవార్డు ప్రదానం
- తొమ్మిదోసారి దక్కిన గౌరవం

కరీంనగర్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ) : కరీంనగర్ కేంద్ర సహకార బ్యాంకుకు మరోసారి జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి జాతీయ ఉత్తమ బ్యాంకుగా ఎంపికైంది. 2015-16 నుంచి వరుసగా తొమ్మిదేండ్లుగా కేడీసీసీబీ ఈ గౌరవాన్ని దక్కించుకుంటున్నది. న్యూ ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో ఈ నెల 27న జరిగే అంతర్జాతీయ సహకార సదస్సులో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా చేతుల మీదుగా బ్యాంక్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, సీఈవో నందెల్లి సత్యనారాయణరావు అందుకోనున్నారు. చైర్మన్, సీఈవోతోపాటు బ్యాంకు ఉపాధ్యక్షుడు రమేశ్, పాలకవర్గ సభ్యులు ఈ అవార్డు అందుకోవడం కోసం ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు.

కేడీసీసీబీతో తెలంగాణకు గౌరవం: గవర్నర్ దత్తాత్రేయ

సహకార రంగంలో కరీంనగర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు తెలంగాణకు మరింత గౌరవాన్ని తీసుకువస్తుందని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పాలకవర్గ సభ్యులు చండీగర్ రాజ్‌భవన్‌లో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న సహకార బ్యాంకుల్లో కేడీసీసీబీ గత 9 సంవత్సరాల్లో ఎనిమిదిసార్లు ఉత్తమ బ్యాంక్ అవార్డులు సాధించడం గర్వించదగిన విషయమని అన్నారు. తెలంగాణకు గౌరవాన్ని తీసుకువచ్చిన బ్యాంకు అధ్యక్షుడు కొండూరు రవీందర్‌రావు, వైస్ చైర్మన్ పింగిలి రమేశ్, సీఈవో సత్యనారాయణ రావుతోపాటు పాలకవర్గ సభ్యులను దత్తాత్రేయ అభినందించారు.

పురాతన మూలాన్ని కనుగొన్న గుట్ట వద్ద పరిశోధకుల బృందం

గట్టమ్మ మూలంతో నాయకపోడుల చరిత్ర

వెల్లడించిన సమ్మక్క-సారక్క ఆర్కియాలజీ పరిశోధన బృందం

ములుగు రూరల్, నవంబర్ 25 : నాయకపోడుల చరిత్ర మొత్తం ఆదిదేవత గట్టమ్మ మూలంతో ముడిపడి ఉందని సమ్మక్క-సారక్క ఆర్కియాలజీ పరిశోధన బృందం సభ్యులు కాక నర్సింగరావు, బుగ్గ కోటేశ్వర్‌రావు అన్నారు. ములుగు జిల్లాలోని గట్టమ్మ గుట్టపై పురాతన మూలాన్ని ఆదివారం పరిశోధన బృందం గుర్తించిన విషయం తెలిసిందే. సోమవారం మరిన్ని వివరాలను పరిశోధన బృందం వెల్లడించింది. గట్టమ్మకు చరిత్రే లేదని, నాయకపోడులది కాదని అంటుండగా చరిత్ర ఉందని తాము నిర్ధారించినట్లు తెలిపారు. ములుగు గ్రామాన్ని నాయకపోడులే పొందుపర్చారని, కొత్త ఇంటి పేరుతో ఉన్న నాయకపోడులు గట్టమ్మ జాతరను జరిపేవారని గుర్తు చేశారు. మేడారం సమ్మక్క తల్లికి అంగరక్షకులుగా ఉన్న ఐదుగురిలో గట్టు పెల్లివాల ఆడబిడ్డ గట్టమ్మ అని, గట్టయ్య చేసుకోవడంతో వారి ద్వారా కొత్త అనే వంశం ఏర్పడిందని చెప్పారు. దీంతో గట్టమ్మ తల్లిని ఇప్పటికీ కొత్త వంశీయులే కొలుస్తున్నారని వివరించారు. చిత్ర లిపికి స్పష్టికర్తలు, బొమ్మలు వేసే విధానం నేర్పిందీ నాయకపోడు తెగవారేనని స్పష్టం చేశారు. గొంతెమ్మ గుట్టకోటలు, గాంధారిఖిల్లా వంటి అనేక చరిత్రాత్మక అంశాలను పుస్తక రూపంలోకి తీసుకొచ్చి గట్టమ్మ చరిత్రను భావితరాలకు తెలియజేస్తామని చెప్పారు. ప్రభుత్వం కూడా గట్టమ్మ గుడి సన్నిధిలో మ్యూజియం ఏర్పాటు చేసి సంస్కృతి, సంప్రదాయాలు కాపాడాలని కోరారు. ఈ పరిశోధనలో ఆదివాసీ మ్యూజియం క్యూరేటర్ కుర్సం రవి, సభ్యులు అర్జున్, నితిన్, మధు, గట్టమ్మ పూజారులు సదయ్య, లక్ష్మయ్య, సమ్మయ్య, సురేందర్, మొగిలి పాల్గొన్నారు.

ఆర్టీసీలో 30% అద్దె బస్సులే

- తెలంగాణ ఏర్పాటు నాటికి 17 శాతం మాత్రమే
- ఎలక్ట్రిక్ బస్సులన్నీ అద్దెవే
- మూడేండ్లలో 8వేల బస్సులు వచ్చే అవకాశం
- పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద 2,800.. మహిళలకు 1000 ఎలక్ట్రిక్ బస్సులు
- అద్దె బస్సులకు డ్రైవర్ల నియామకం నిర్వాహకులదే

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తేతెలంగాణ): ఆర్టీసీలో అద్దె బస్సుల సంఖ్య పెరిగింది. ఇప్పటికే 2,800 ప్రైవేటు బస్సులు ఉండగా, మరో 3 వేల బస్సులను అద్దె ప్రాతిపదికన తీసుకునేందుకు ఆర్టీసీ యాజమాన్యం ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రస్తుతం ఆర్టీసీలో మొత్తం 9,800 బస్సులు ఉన్నాయి. వీటిల్లో ప్రైవేటు వ్యక్తులు ఆర్టీసీకి అద్దెకిచ్చిన బస్సులు 2,800 ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014లో ఆర్టీసీలో అద్దె బస్సుల వాటా 17 శాతం మాత్రమే. ఆర్టీసీకి ఇవ్వాల్సిన గ్రాంట్లు ఇవ్వకపోవడం, బకాయిలు పెరగడంతో తప్పనిసరి పరిస్థితుల్లో అద్దె బస్సులను పెంచుతూ వస్తున్నారు. ఇలా పెంచుకుంటూపోతే .. రాను న్నరోజుల్లో ఆర్టీసీలో సొంత బస్సులు ఉండే అవకాశమేలేదని ఆర్టీసీ కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అద్దె బస్సుల సంఖ్యను పెంచడాన్ని ఆర్టీసీ కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అద్దె బస్సులకు డ్రైవర్లను వాటి నిర్వాహకులే నియమిస్తుండటంతో.. డ్రైవర్ల జీతాల ఖర్చు తగ్గుతుందని ఆర్టీసీ యాజమాన్యం భావిస్తున్నది.

ఎలక్ట్రిక్ బస్సులన్నీ అద్దె బస్సులే..

ఆర్టీసీలో కొత్తగా తీసుకుంటున్న ఎలక్ట్రిక్ బస్సులన్నీ అద్దె ప్రాతిపదికనే తీసుకుంటున్నారు. 'ఫేమ్' పథకం కింద హైదరాబాద్ విమానాశ్రయానికి తిప్పుతున్న 40 ఎలక్ట్రిక్ బస్సులు, ఇటీవల మరో 100 ఎలక్ట్రిక్ బస్సులు ఒలెక్ట్రా సమకూర్చింది. వీటితోపాటు ఢిల్లీకి చెందిన జేబీఎం సంస్థ మరో 90 ఎలక్ట్రిక్ బస్సులు సమకూర్చింది. కొత్తగా వచ్చిన మరో 40 బస్సులను ప్రారంభించాల్సి ఉంది. ఇలా ప్రస్తుతం మొత్తం బస్సుల్లో అద్దె బస్సుల వాటా దాదాపు 30 శాతానికి చేరింది.

మూడేండ్లలో ఎనిమిది వేల బస్సులు

కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన 'పీఎం-ఈ డ్రైవ్' పథకం కింద 2,800 బస్సులు మంజూరు చేయాలని ఆర్టీసీ దరఖాస్తు చేసింది. దేశవ్యాప్తంగా ఆ పథకం కింద ఎలక్ట్రిక్ బస్సులు తిప్పేందుకు కేంద్రం 9 నగరాలను ఎంపిక చేసింది. అందులో హైదరాబాద్ కూడా ఒకటి. ఆర్టీసీ దరఖాస్తు మేరకు ఎలక్ట్రిక్ బస్సులు మంజూరు కానున్నాయి. తాజాగా మహిళా సంఘాలు 1,000 బస్సులను ఆర్టీసీలో అద్దె ప్రాతిపదికన నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇవన్నీ పరిగణనలోకి తీసుకుంటే మూడేళ్లలో అద్దె బస్సుల సంఖ్య 8వేలకు చేరే అవకాశం ఉంది. అద్దె బస్సులు భారీగా వస్తున్నందున సొంత బస్సులు కొనేందుకు ప్రభుత్వం ఆసక్తి చూపడం లేదని ఆర్టీసీ కార్మికులు పేర్కొంటున్నారు.

దివ్యాంగుల ప్రత్యేక కమిషనర్‌ను ఎందుకు నియమించలేదు

- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

హైదరాబాద్, నవంబర్ 25, (నమస్తే తెలంగాణ): దివ్యాంగుల చట్టం కింద ప్రత్యేక కమిషనర్ నియమాకం చేపట్టకపోవడంపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. దివ్యాంగుల హక్కుల చట్టం సెక్షన్ 70(1) కింద ప్రత్యేక కమిషనర్ ఏర్పాటు చేయకపోవడాన్ని సవాలు చేస్తూ ఆలిండియా కాన్ఫెడరేషన్ ఆఫ్ ది బ్లైండ్, మరో సంస్థ వేసిన పిటిషన్లను జస్టిస్ సూరేపల్లి నంద సోమవారం విచారించారు. న్యాయవాది సాహితి శ్రీకావ్య వాదనలు వినిపిస్తూ ప్రత్యేక కమిషనర్‌ను నియమించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. స్పందించిన హైకోర్టు వివరణ ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

మత్స్యశాఖలో 'అవినీతి' చేప!

- జిల్లాల్లో అధికారుల ఇష్టారాజ్యం
- నాణ్యతలేని చేపపిల్లల పంపిణీ
- తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు
- లక్ష్యం 40 కోట్లు, వేసింది 23 కోట్లే

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): ఉచిత చేపపిల్లల పంపిణీ పథకంలో భారీ అవినీతి జరుగుతున్నట్టు తెలుస్తున్నది. సరఫరాదారులతో కొందరు మత్స్యశాఖ అధికారులు కుమ్మక్కై అడ్డంగా దోచుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సరఫరాదారులిచ్చే తాయిలాలకు ఆశపడి ఈ పథకానికి తూట్లు పొడుస్తూ మత్స్యకారుల ఉపాధికి గండి కొడుతున్నారనే విమర్శలు వ్యక్త